సాక్షి శ్రీకాకుళం

గురువారం । 7 । నవంబర్ । 2024



అడవి పందుల బెడద..

అన్నదాతలకు అడవి పందుల బెడద ఎక్కువైంది. చేతికందిన పంటను నాశనం చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. - 10లో



బెల్టుషాపులను నియంత్రిస్తాం

ప్రత్యేక బృందాల ద్వారా జిల్లావ్యాప్తంగా ఉన్న బెల్టుషాపులను నియంత్రిస్తామని, నాటుసారా విక్రయాలను అరికడతామని ఎక్సైజ్ డీసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. - 10లో

12న జిల్లా యువ ఉత్సవ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 12న జిల్లా యువ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు ఉత్సవ్ చైర్‌పర్సన్ అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య యువత అర్హులని, పూర్తి వివరాలకు 9133095645, 6304520703 నంబర్లను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

బద్రీనాథ్ టు శబరిమల

- 8వేల కిలోమీటర్ల మేర అయ్యప్పస్వాముల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న స్వాములను సత్కరిస్తున్న కంచిలి అయ్యప్ప భక్తులు

కంచిలి: కేరళరాష్ట్రం కసర్‌గుడ్ రామ్‌దాస్‌నగర్‌కు చెందిన సనత్‌కుమార్ నాయక్, సంపత్ కుమార్ శెట్టిలు బద్రీనాథ్ నుంచి శబరిమలకు పాదయాత్ర చేపట్టారు. జాతీయ రహదారి మీదుగా కంచిలిలోని రాజు గురుస్వామి అయ్యప్ప సన్నిధానానికి బుధవారం విచ్చేశారు. వీరు కేరళ నుంచి రైలు ద్వారా మే 26న ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బద్రీనాథ్‌కు చేరుకున్నారు. జూన్ 2న బద్రీనాథ్ ఆలయం నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. అయోధ్య, ఉజ్జయిని మహంకాళి, ద్వారకా, పూరి జగన్నాథ్ దర్శించుకున్నారు. తిరుపతి, రామేశ్వరం ఆలయాల మీదుగా శబరిమలకు మొత్తం 8 వేల కిలోమీటర్ల మేర కాళ్లకు చెప్పులు లేకుండా యాత్ర చేయనున్నారు. ఇప్పటి వరకు 5,800 కిలోమీటర్లు యాత్ర పూర్తిచేసినట్లు స్వాములు తెలిపారు. ప్రపంచ శాంతి, ఉత్తర భారతదేశంలో అయ్యప్పస్వామి ప్రాసస్త్యాన్ని తెలియజేస్తూ ఈ యాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండేళ్ల కిందట కూడా బద్రీనాథ్ నుంచి శబరిమలకు నేరుగా పాదయాత్ర పూర్తిచేశామన్నారు. మధ్యాహ్నం భిక్ష అనంతరం వీరు మళ్లీ పాదయాత్ర ప్రారంభించారు.

8న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు




అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 2వ స్థాయీ, 11 గంటలకు 4వ, 12 గంటలకు 1వ, ఒంటి గంటకు 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరుగుతాయని, మధ్యాహ్నం 3 గంటలకు 6వ స్థాయీ, 4 గంటలకు 3వ స్థాయి, 5 గంటలకు 5వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ ఉపాధ్యక్షులు పాలిన శ్రావణి, సిరిపురపు జగన్మోహనరావు, వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి అధ్యక్షతన జరగనున్నాయని వివరించారు. అధికారులంతా తాజా ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

జిల్లాలో శైవక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు



శైవక్షేత్రాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు



శ్రీకాకుళం అర్బన్: కార్తీక మాసం సందర్భంగా జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాల సందర్శనార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మలు పిలుపునిచ్చారు. బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రత్యేక బస్సుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీముఖలింగం, రావివలస, సంగమేశ్వరాలయం, ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయం, శ్రీచక్రపురం తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. పల్లెవెలుగు బస్సు ప్రయాణచార్జీ ఒక్కొక్కరికీ రూ.350గా నిర్ణయించినట్లు చెప్పారు. ధనుర్మాసం సందర్భంగా వైష్ణవ దేవాలయాలైన శ్రీకూర్మం, శ్రీమున్నార్ రాజగోపాల స్వామి ఆలయం(విజయనగరం), రామతీర్థం, రామానారాయణం, బాలాజీ టెంపుల్(గంట్లాం) తదితర పుణ్యక్షేత్రాలను ఒకేరోజు దర్శించేలా ప్రత్యేకబస్సులు నడపనున్నట్లు వివరించారు. పల్లెవెలుగు బస్సుకు ప్రయాణ చార్జీ ఒక్కొక్కరికి రూ.350 నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7382921647, 7382917289 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, బి.దక్షిణామూర్తి, హెచ్‌సీ ఉమాశంకర్, ఎస్.శిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

> "మేం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం.. వీలైనంతగా తగ్గిస్తాం..
> -ఇదీ ఎన్నికల సమయంలో చంద్రబాబు మాటలు..





డబుల్ షాక్!

ఆరు నెలల్లోనే వరుసగా రెండోసారి విద్యుత్ చార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట ఈ నెల నుంచి వరుసగా 15 నెలల పాటు భారం మోపనున్న కూటమి సర్కారు.. తాజాగా అదనపు సర్దుబాటు చార్జీల పేరిట వచ్చే నెల నుంచే చార్జీల మోత మోగించేందుకు సమాయత్తమైంది. ఈ మేరకు విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదనలు చేరగా ఆమోదం లభించడం లాంఛనమే. దీంతో డిసెంబర్ నుంచి విద్యుత్ వినియోగదారులకు డబుల్ షాక్ తగలడం ఖాయం.

-అరసవల్లి

నిన్న సర్దుబాటు.. నేడు అదనపు సర్దుబాటు చార్జీలు

- వచ్చే నెల నుంచి యూనిట్ విద్యుత్‌పై గరిష్టంగా రూ.3 అదనం!
- జిల్లాలో 7.88 లక్షల మంది వినియోగదారులపై ప్రభావం
- చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని విస్మరించిన చంద్రబాబు



మరోసారి మోత..!

ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట ఇటీవలే ప్రతిపాదనల ఆమోదం మేరకు యూనిట్‌కు గరిష్ఠంగా రూ.1.55 వరకు చార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం.. తాజాగా మరోసారి ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు చార్జీల (ఎఫ్‌పీపీసీఏ) పేరిట వినియోగదారుల నుంచి ముక్కుపిండి చార్జీలు వసూళ్లు చేసేందుకు ముందుకు వెళ్తోంది. ఇప్పటికే నవంబర్ (ఈ నెల) నుంచి 15 నెలల పాటు అంటే 2026 జనవరి వరకు అదనపు చార్జీల భారం పడుతున్న క్రమంలో మళ్లీ అదనంగా ఈ ఏడాది డిసెంబర్ నుంచి సుమారు మరో రెండేళ్ల పాటు ఈ ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరిట అదనపు వసూలు చేయనున్నారని సమాచారం. దీని ప్రకారం యూనిట్‌కు అదనంగా మరో రూ.1.60 వరకు పెరిగే అవకాశముంది. దీంతో వచ్చే నెల నుంచి ఒక్కో యూనిట్‌పై గరిష్ఠంగా రూ.3 వరకు భారం పడనుంది. ఇప్పటికే తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతిపాదనలను ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఆమోదించే స్థితిలో పంపించేసింది. ఈనెల 19లోగా వివిధ వర్గాల విద్యుత్ వినియోగదారుల నుంచి ఆన్‌లైన్‌లోనే అభిప్రాయాలను నామమాత్రంగా సేకరించి.. చార్జీల మోతపై ఆమోదానికి లైన్ క్లియర్ చేసుకునేలా డిస్కం అధికారులు చర్యలకు దిగుతున్నారు. వాస్తవానికి ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు చార్జీలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భరిస్తే.. ఎలాంటి విద్యుత్ చార్జీల పెంపు జరిగే అవకాశముండేది కాదు. అయితే ఈ భారాన్ని తాము మోయలేమంటూ కూటమి సర్కారు చేతులెత్తేయడంతో చార్జీల షాక్ రాష్ట్ర ప్రజలకు తప్పడం లేదు.

అంతా గప్‌చుప్..

సర్దుబాటు చార్జీల పెంపు అంశంపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతున్నా.. విద్యుత్ శాఖాధికారులు ఎక్కడా గొంతు మెదపొద్దని, అవసరమైతే గత ప్రభుత్వం చేసిన నిర్వాకమే అన్నట్లుగా ప్రచారం చేయాలని కూటమి సర్కార్ మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయమై విద్యుత్ శాఖాధికారుల వద్ద 'సాక్షి' ప్రస్తావించగా.. సర్దుబాటు చార్జీల పెంపు విషయంపై తమ వద్ద ఎలాంటి అధికారిక సమాచారం గానీ, ఆదేశాలు గానీ రాలేదని చెబుతున్నారు.

రూ.6 కోట్ల వరకు పెరగనున్న డిమాండ్..

జిల్లాలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, పలాస, టెక్కలి డివిజన్ల పరిధిలో 7,88,078 విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటిలో హెచ్‌టీ వినియోగదారులు 477 మాత్రమే ఉండగా మిగిలినవన్నీ ఎల్‌టీ వినియోగదారులే. ఇంతవరకు ఈ విద్యుత్ కనెక్షన్ల నుంచి విద్యుత్ వినియోగం దృష్ట్యా అన్ని రకాల చార్జీలతో కలిపి అక్టోబర్ నెలాఖరు నాటికి రూ.97.55 కోట్లు కాగా, నవంబర్ నెలాఖరుకు (సర్దుబాటు ఛార్జీతో కలిపి) ఈ డిమాండ్ ఏకంగా రూ.100.45 కోట్లు వరకు ఉండే అవకాశాలున్నాయి. అంటే డిసెంబర్ నుంచి కొత్త అదనపు సర్దుబాటు చార్జీల అమలైతే అదనంగా మరో రూ.3 కోట్ల వరకు డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయి. తాజా పరిణామాలతో ఎల్‌టీ (డొమెస్టిక్) వినియోగదారునికి యూనిట్‌కు ప్రస్తుతానికి రూ.1.90 వసూలు చేస్తుండగా, ఈ నెల రానున్న బిల్లు నుంచి యూనిట్ చార్జీ రూ.3.20 వరకు కలవనుంది. మొత్తంగా యూనిట్ చార్జీ రూ.4.70 వరకు వసూలు చేసే అవకాశాలున్నాయి. అదే అధికంగా విద్యుత్‌ను వినియోగించే వారికైతే యూనిట్‌కు గరిష్ఠంగా రూ.15 వరకు మోతమోగనుందని లెక్కలు చెబుతున్నాయి. విద్యుత్ వినియోగ డిమాండ్ ప్రకారం నెలకు అదనంగా జిల్లా వ్యాప్తంగా రూ.6 కోట్ల వరకు పెరిగే అవకాశముంది.

నిజం చెప్పడమే నేరమా?

కళ్ల ముందు కనిపించిన నిజాన్ని సోషల్ మీడియా పోస్టు చేయడమే వారు చేసిన నేరమైంది. కూటమి ప్రభుత్వంలో నెలకొన్న సమస్యలపై సోషల్‌మీడియాలో పోస్టు చేశారనే కారణంతో అమాయక యువకులను, వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను పోలీసులు వెంటాడుతున్నారు. విచారణ పేరిట ఇళ్లకు వెళ్లి గంటల తరబడి ఉంటూ కుటుంబ సభ్యులను మానసికంగా వేధిస్తున్నారు. పోస్టులు పెట్టిన యువకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రోజంతా ఉంచేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఒకరోజుతో కాకుండా ఎప్పుడు పడితే అప్పుడు స్టేషన్‌కు పిలిపిస్తూ తమను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు, కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వజ్రపుకొత్తూరు రూరల్/కాశీబుగ్గ

భయం వేసింది..



ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ముగ్గురు పోలీసులు మా ఇంటికి వచ్చినప్పుడు నేను ఒంటరిగా ఉన్నాను. నా కొడుకు కోసం అడిగారు. ఏం జరిగిందని పోలీసులను అడిగితే సమాధానం చెప్పకుండా నీ కొడుకుని పిలువమ్మా.. అంటూ ఇంటి దగ్గరే కూర్చున్నారు. బాబు ఫంక్షన్‌కి వెళ్లాడు.. వచ్చే సరికి టైం పడుతుందని చెప్పినా వినకుండా మా డాబాపైకి ఎక్కి చాలాసేపు అక్కడే ఉన్నారు. మీ అబ్బాయికి ఫోన్ చెయ్.. అంటూ ఒత్తిడి చేశారు. గంటన్నర తర్వాత ఇంటికి వచ్చిన మా బాబుని పోలీసులు తీసుకువెళ్లారు. రేపు ఉదయం వస్తాము.. అని చెప్పినా పోలీసులు వినకుండా బలవంతంగా తీసుకువెళ్లారు. నా కొడుకు ఏ తప్పు చేశాడో తెలియదు. పోలీసులు ఎందుకు ఇలా వేధిస్తున్నారో తెలియదు. గుట్టుగా బతికే మా ఇంటికి పోలీసులు రావడంతో నాకు చాలా భయం వేసింది.

- మద్దు శకుంతుల, బాధితుడు జశ్వంత్ తల్లి

పదేపదే వేధిస్తున్నారు..

ఈ నెల 1న నువ్వలరేవులో బైనపల్లి దానమ్మ అనే వృద్ధురాలు పింఛన్ కోసం తిరిగి తిరిగి సొమ్మసిల్లి పడిపోయారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమె పలాసలో చికిత్స పొందింది. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశానని నాపై అక్రమ కేసులు పెట్టారు. నన్ను పోలీస్‌స్టేషన్‌కు రమ్మని పదే పదే వేధిస్తున్నారు. కుటుంబాన్ని భయాందోళనకు గురి చేస్తున్నారు.

- మద్దు జశ్వంత్, కొండపల్లి గ్రామం, వజ్రపుకొత్తూరు మండలం

నేనేమైనా తీవ్రవాదినా?



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు నుంచీ ఆయన వెంటే ఉన్నాం. సోషల్‌మీడియాతో పాటు పిడిమందస గ్రామంలో రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నామని మాపై కక్ష గట్టి ఇబ్బందులు పెడుతున్నారు. నేను ఏ తప్పు చేయకుండానే విచారణ పేరుతో వేకువజామున ఐదు గంటలకు మా ఇంటిని పోలీసులు చుట్టుముట్టి భయాందోళనకు గురిచేశారు. విచారణ పేరుతో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉంది. నేనేమైనా తీవ్రవాదినా, నక్సలైట్‌నా? నా ఇంటి చుట్టూ పోలీసుల వలయం ఏమిటి?

- గుంపు జగదీష్, పిడిమందస, మందస మండలం

రబీ రుణ లక్ష్యం రూ.685 కోట్లు



మాట్లాడుతున్న డీజీఎం రమేష్

కొత్తూరు: రబీ సీజన్‌లో జిల్లాలో రూ.685 కోట్ల మేర రుణాలు అందజేసేందుకు నిర్ణయించినట్లు డీసీసీబీ డీజీఎం శిల్లా రమేష్ తెలిపారు. కొత్తూరులోని డీసీసీబీ బ్రాంచిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు రబీ రుణాలుగా రూ. 463 కోట్లను రైతులకు అందజేసినట్లు చెప్పారు. మిగిలిన లక్ష్యాలను 2025 మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది అన్ని రకాల రుణాలు రూ.2500 కోట్లుగా నిర్ణయించి ఇప్పటి వరకు రూ.1980 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. బంగారంపై రూ.450 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది నూతనంగా ధనవర్షి డిపాజిట్ పథకం అమలు చేస్తున్నామని, 330 రోజులకు మెచ్యూరిటీ అవుతుందని చెప్పారు. సీనియర్ సిటిజన్లకు 8.1 శాతం వడ్డీ, సాధారణ వ్యక్తులకు 7.5 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఏఎస్‌బీ శ్రీనివాసరావు, బ్రాంచి మేనేజర్ డి.ప్రసన్న పాల్గొన్నారు.



జీతమో రామచంద్ర!

ఆకలి మంటలతో 102, 104, 108 సిబ్బంది

- నెలల తరబడి జీతాలు అందకపోయినా పట్టించుకోని సీఎం చంద్రబాబు
- 350 మందికిపైగా ఉద్యోగులకు తప్పని కష్టాలు

నరసన్నపేట:

ప్రజారోగ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు వేతన కష్టాలు వెంటాడుతున్నాయి. 104, 108, 102 వాహనాల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న సిబ్బంది జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే వేతనాలు ఇవ్వలేకపోతున్నామని ఏజెన్సీ అయిన అరబిందో సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. వేతనాలు నెలవారీ రాకపోవడంతో తమ విధులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు అందక అప్పులు చేయాల్సి వస్తోందని, ఇక తమ వల్ల కాదని చేతులెత్తేస్తున్నారు.

నెలల తరబడి బకాయిలు..

బాలింతలకు తమ స్వగ్రామాలకు చేర్చుతూ బాధ్యతలను నిర్వహించడంలో 102 సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇందులో పనిచేస్తున్న డ్రైవర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తున్నారు. కటింగ్‌లు పోనూ చేతికందేది రూ.8 వేలు. ఈ డబ్బులు కూడా జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబరు నెలలకు చెల్లించాల్సి ఉంది. ఇన్ని నెలలుగా వేతనాలు రాకపోతే ఎలా అని వారు వాపోతున్నారు. గ్రామాల్లో పేద ప్రజలతో పాటు మధ్యతరగతి కుటుంబాల చెంతకే వైద్యం అందించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయడంలో 104 సిబ్బంది కీలకంగా ఉన్నారు. వీరికి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబరు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. దీంతో వీరంతా తమ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వీరంతా రెండు రోజులుగా ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు పీహెచ్‌సీల్లో ఉన్న వైద్యాధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న 104 సిబ్బంది ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారికి మెమొరాండంలు అందిస్తున్నారు. జీఓ నంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.104 సర్వీసులు పీహెచ్‌సీల ద్వారా నిర్వహింపచేయాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగులకు బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక 108 సిబ్బంది సేవలు ఎంతనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రమాదాలతో పాటు వైద్య పరంగా ఏ అత్యవసరం అయినా 108 సిబ్బంది వారిని ఆసుపత్రులకు తరలించడంలో ముందుంటున్నారు. వీరికి కూడా మూడు నెలల బకాయిలు అందించాల్సి ఉంది.

ఇబ్బంది పడుతున్నాం



నెలనెలా ఇవ్వాల్సిన వేతనాలు మూడు నెలలుగా రాక ఇబ్బందులు పడుతున్నాం. వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండగలకు అప్పులు చేయాల్సి వచ్చింది. మళ్లీ అప్పులు అడిగితే వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. నిర్వహణ సంస్థకు అడిగితే ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదంటున్నారు. మధ్యలో మేం ఇబ్బందులు పడుతున్నాం. మా కష్టాలు గమనించి తగు చర్యలు తీసుకోవాలి. - వెంకట్రావు, 104 వాహనం డ్రైవర్



వాహనాలు	డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఖ్య
53	114



వాహనాలు	పైలెట్లు, ఈఎంటీల సంఖ్య
31	15



వాహనాలు	డ్రైవర్ల సంఖ్య
18	14

మంచు దుప్పటి



మంచుతెరలు కమ్ముకుంటున్నాయి. తెల్లటి దుప్పటి పరుచుకున్నాయా అన్నట్లు రోడ్లన్నీ మంచుతో నిండిపోతున్నాయి. హిరమండలం మేజర్ పంచాయతీలోని అలికాం-బత్తిలి రోడ్డులో బుధవారం వేకువజామున మంచుతీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మంచుపడే సమయంలో చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోస బాధితులు బయటకు రాకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

- హిరమండలం

ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు పెట్టే ఆహారాన్ని పరిశీలిస్తున్న గురుకులాల సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించగలరని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. పాతపట్నం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు అపార్ ఐడీ నంబర్‌లు పొందాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌశల్-2024 పోటీలకు ఆహ్వానం

- నవంబర్ 15లోగా విద్యార్థుల వివరాలు నమోదు చేసుకోవాలి: డీఈఓ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ, అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు కౌశల్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కౌశల్-2024 పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను డీఈఓ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.వి.మధుబాబుతో కలిసి డీఈఓ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ప్రతిభా అన్వేషణ పరీక్షలలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. హెచ్ఎంలు, కౌశల్ కో-ఆర్డినేటర్లు చొరవ తీసుకొని విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. విజేతలకు గవర్నర్ చేతుల మీదుగా బహుమతులు అందుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. నవంబర్ 15లోగా బీవీఎం ఏపీ.ఓఆర్జీ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని కోరారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 20, 21, 22 తేదీలలో ఆన్‌లైన్‌లో ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తారని, జిల్లాస్థాయిలో డిసెంబర్ 6న క్విజ్ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8919224024, 9030032667 నంబర్లకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కౌశల్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఉమేష్‌కుమార్, సాయి కృష్ణప్రసాద్, రామ్మోహన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయాలపాలైన వెంకటరమణ

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాకివలస గ్రామానికి చెందిన ఎస్.వెంకటరావు గాయాలపాలైయ్యాడు. వెంకటరావు సారవకోట నుంచి అలుదు గ్రామం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఆయనను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మృతుడి కుటుంబానికి రూ.12,76,052 అందజేత


సుందరమ్మకు పరిహారం అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాం అక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమలో పనిచేస్తున్న సుతారి రాజేష్ అనే కార్మికుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కార్మికులు ఒక్క రోజు వేతనం ప్రకటించగా, పరిశ్రమ యాజమాన్యం పలు రాయితీలు వర్తింపజేశారు. ఈ మొత్తం రూ.12,76,052 బుధవారం పరిశ్రమ ఉపాధ్యక్షుడు కె.శేషగిరిరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఆధ్వర్యంలో రాజేష్ భార్య సుందరమ్మకు అందజేశారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన


మాట్లాడుతున్న అంజనాస్ ఫౌండేషన్ చైర్మన్ నవీన్ బచ్చు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 107 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. కళాశాల జేకేసీ, అంజనాస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్కిన్డర్ ఎలక్ట్రికల్ కాంపొనెంట్స్, ప్రీమియర్ ఎనర్జీ సోలార్ ప్యానల్, టాటా ఎలక్ట్రానిక్స్, ఐఫోన్ అసెంబ్లింగ్ తదితర కంపెనీల్లో ఖాళీలకు 154 మంది హాజరయ్యారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన 107 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమంలో అంజనాస్ ఫౌండేషన్ చైర్మన్ నవీన్ బచ్చు, బి.సతీష్‌కుమార్, వి.ల్యూక్‌పాల్, బి.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పింఛన్లు ఇవ్వలేదంటూ ఆందోళన


ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

బూర్జ: మండలంలోని తోటవాడలో పింఛన్లు అందక లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు పింఛన్ అందచేసి ప్రస్తుతం పింఛన్ నిలుపుదల చేశారని గ్రామానికి చెందిన శేపాన గోవిందరావు, శేపాన భుజంగరావు, గేదెల శ్రీనివాసరావు, గుమ్మడి చిన్నమ్మడు బుధవారం సచివాలయం వద్ద లబోదిబోమన్నారు. ఈ విషయమై బూర్జ ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థి కృపాసింధును అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

మెళియాపుట్టి: శ్రీకాకుళం నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పెద్దమడి గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.కృపాసింధు సత్తాచాటాడు. ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. దీంతో లక్నోలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పెద్దమడి కళాశాలలో పతకాలు సాధించిన విద్యార్థితోపాటు, కళాశాల పీడీ లక్ష్మణరావులను ప్రిన్సిపాల్ మధుసూదనరావు అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, పలువురు అధ్యాపకులు, తోటి విద్యార్థులు పాల్గొన్నారు.

అడవి పందుల బెడద.. అన్నదాతకు వ్యధ..!

- చేతికందిన పంటను నాశనం చేస్తున్న వైనం
- చీకటిపడితే గుంపులుగా పొలాల్లోకి ప్రవేశం
- పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు


జంబాడ సమీపంలో పొలంలో రాత్రులు ఉండేందుకు ఏర్పాటు చేసుకున్న అరప

ఎల్.ఎన్.పేట: పంట పండించిన రైతులకు నష్టం ఏ రూపంలో వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. ఎక్కువగా అతివృష్టి, అనావృష్టితో పాటు తెగుళ్లు సోకి పంటలకు నష్టం జరుగుతుంది. అయితే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంట బాగా పండిందని రైతులు సంతోషపడుతున్నారు. కానీ పంట చేతికందే సమయంలో పంటలపై అడవి పందులు దాడిచేసి నష్టపరుస్తున్నాయి. చీకటి పడితే అడవి పందుల గుంపులు పంట పొలాలపై దాడిచేసి పంటను తినేయడంతో పాటు కాలితో తొక్కేసి వెళ్లిపోతున్నాయి. దీంతో మరో వారం, పది రోజుల్లో కోతలు పూర్తి చేస్తామని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. తమ సమస్యను, జరిగిన నష్టాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.

నదీతీరాల్లో స్థావరాలు

పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ అడవి పందుల ప్రభావం ఉంది. నియోజకవర్గంలో అటవీ ప్రాంతంతో పాటు వంశధార, మహేంద్రతనయ నదులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటూనే సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. తినేందుకు పంట పొలాలు, తాగేందుకు నీరు, తిరిగేందుకు విశాలమైన ప్రాంతం ఉండడంతో ఘననీయంగా అడవి పందులు వృద్ధి చెందుతున్నాయి. చీకటిపడితే పంట పొలాల్లోకి వచ్చి పంటలను తినేస్తున్నాయి.

పొలంగట్లపై కాపలా

అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. చీకటి పడితే పంట పొలాల్లోకి వచ్చే అడవి పందుల గుంపులను అడ్డుకునేందుకు పొలం గట్లుపైనే కాపాలా ఉంటున్నారు. ఒక ప్రాంతానికి చెందిన కొందరు రైతులు పొలంగట్లుపై రాత్రులు టపాసులు కాల్చుతూ పంటకు కాపాలాగా ఉంటున్నారు. అడవి పందులు వచ్చేదారుల్లో అగ్గి మంటలు వేస్తున్నారు. పొలం గట్లుపైన మనుషులు ఉన్నట్లు భ్రమ కలిగించేలా బొమ్మలు ఏర్పాటు చేస్తున్నారు. గాలికి ఎగిరేలా పొలం గట్టు చుట్టూ ప్లాస్టిక్ పేపర్‌తో కూడిన కంచెలను ఏర్పాటు చేసి పందుల రాకను కట్టడి చేస్తున్నారు.


కొత్తగోలుకుప్పలో పంటచుట్టూ ప్లాస్టిక్ పేపర్‌తో కంచె ఏర్పాటు చేసిన దృశ్యం


జంబాడ ఫారెస్ట్ రోడ్డు సమీపంలో పంట పొలం గట్లుపై ఏర్పాటు చేసిన తెల్లని ప్లాస్టిక్ సంచులు

పంటను తినేస్తున్నాయి



చీకటి పడితే అడవి పందులు దాడిచేసి పంటను తినేస్తున్నాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో అప్పులు చేసి పంటను పండిచాం. పంట చేతికందే సమయంలో పంటను తినేసి, కాలితో తొక్కేయడం వలన పాడైపోతోంది. పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాం.

– కొల్ల కృష్ణ, రైతు, దొంకలబడవంజ, ఎల్.ఎన్.పేట

నష్టపరుస్తున్నాయి



కొండల దిగువనే ఉండడంతో పంట పొలాలపై అడవి పందులు దాడులు చేసి పంటను నష్టపరుస్తున్నాయి. పంటను కాపాడుకునేందుకు పొలం గట్లుపైనే రాత్రులు కాపలా కాస్తున్నాం. పొలం గట్లుపై రాత్రులు పటాసులు కాల్చి శబ్దాలు చేస్తూ పంటను కాపాడుకుంటున్నాం. వారం, పది రోజులు పంటను కాపాడుకుంటే కోతలు అవుతాయని ఆశగా ఉన్నాం.

– పాలక పట్టయ్య, రైతు, జంబాడ, ఎల్.ఎన్.పేట

బెల్టు షాపులను నియంత్రిస్తాం

- జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ శ్రీకాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న డీసీ శ్రీకాంత్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఎక్సైజ్ శాఖలోని ప్రత్యేక బృందాల ద్వారా జిల్లావ్యాప్తంగా ఉన్న బెల్టుషాపులను నియంత్రిస్తామని, నాటుసారా విక్రయాలను అరికడతామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని 80 ఫీట్‌రోడ్డులో గల జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్టు, ఐడీ, లిక్కర్, నాటుసారా వంటి వాటిని నియంత్రించేందుకు జిల్లావ్యాప్తంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్టోబరు 29 నుంచి ఇప్పటివరకు 52 బెల్టుషాపులపై దాడులు నిర్వహించి 52 మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. 645 మద్యం బాటిళ్లు, 29 బీర్లు సీజ్ చేశామన్నారు. రెండేళ్లుగా బెల్టుషాపులు నడుపుతున్న పాతవారిపై సెక్షన్ 128 కింద బైండోవర్‌లు కట్టామని, మళ్లీ నిర్వహిస్తే రూ.లక్ష జరిమానాతో పాటు కోర్టులో జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు.

బీట్ బృందాల ద్వారా..

జిల్లావ్యాప్తంగా బీట్ విధానం ద్వారా సిబ్బందితో వార్డులు, గ్రామాల్లో జల్లెడ వేయిస్తామని.. స్థానికులతో మమేకమై బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకునేలా చేస్తామన్నారు. లైసెన్స్‌డ్ షాపుల్లో ఎంఆర్పీకంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒడిశా నుంచి మద్యం రాకుండా ఏవోబీ ప్రాంతాల్లో బోర్డర్ మొబైల్ బృందాలను నియమించామన్నారు. మంగళవారం ఇచ్ఛాపురంలో ఓ ఎన్డీపీఎస్ కేసు కూడా నమోదు చేశామన్నారు. టెక్కలి, సోంపేట, పాతపట్నం, కొత్తూరు సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పటికే అక్రమంగా నాటుసారా తరలిస్తున్నవారిని గుర్తించి బైండోవర్లు కట్టామన్నారు. మళ్లీ పట్టుబడితే జైలుకు పంపడం ఖాయమన్నారు.

త్వరలో ప్రత్యేక కమిటీ..

గ్రామాల్లో మహిళా పోలీసులు, పీఎస్‌లో ఉండే పోలీసులు, రెవెన్యూ విభాగ సిబ్బందితో ప్రత్యేక సమన్వయ కమిటీని వేయనున్నామని డీసీ తెలిపారు. ఎక్కడ మద్యం అక్రమ రవాణా జరిగినా, బెల్టుషాపులు నిర్వహించినా, ఎంఆర్పీ కంటే ఎక్కువగా విక్రయించినా నిరభ్యంతరగా సమాచారం ఇవ్వొచ్చని, వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

వానరానికి దహన సంస్కారాలు


దహన సంస్కారాలు చేస్తున్న బూరగాం గ్రామస్తులు

కంచిలి: మండలలలోని బూరగాం వద్ద జాతీయ రహదారిపై బుధవారం కారు ఢీకొనడంతో ఓ వానరం మృతిచెందింది. దీంతో స్థానికులు మడ్డు తిరుపతిరావు మాస్టర్, పరపతి జగదీష్, బుడ్డ మహేష్, వంక రమణ, ఆబోతు ఢిల్లీరావు, మణి పాత్రోలు కలిసి వానరానికి శాస్త్రోక్తంగా పూజలు చేసి దహనసంస్కారం చేశారు. కాగా, బూరగాం కూడలి వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విశాఖలో కొత్తపేట మత్స్యకారుడు మృతి


జగదీష్ (ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు గండుపల్లి జగదీష్(36) విశాఖపట్నం సముద్ర తీరంలో చేపలు వేటకు వెళ్లి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 4వ తేదీన చేపల వేటకు వెళ్లి వలతాడును ఒడ్డుకు లాగే క్రమంలో ప్రమాదవశాత్తు సముద్రంలో పడి గల్లంతయ్యాడు. దీంతో మృతుని ఆచూకీ కోసం రెండు రోజులు పాటు గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం జగదీష్ మృతదేహం బుధవారం లభ్యమైంది. మృతునికి భార్య లక్ష్మి, 13 ఏళ్ల కుమారుడు, 11 ఏళ్ల కుమార్తె ఉన్నారు. కాగా జగదీష్ మృతితో కుటుంబంతో పాటు గ్రామంలో విషాదం నెలకొంది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పేదల డాక్టర్ యయాతి మృతి


మెండ యయాతి (ఫైల్)

నరసన్నపేట: పేదలకు అండగా ఉంటూ వారికి సుదీర్ఘ కాలం వైద్యం అందించిన డాక్టర్ మెండ యయాతి(74) బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన గత రెండేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. చిన్నతనంలోనే వైద్య వృత్తిని చేపట్టిన యయాతి పోలాకి, సారవకోట, హరిపురం పీహెచ్‌సీల్లో పనిచేశారు. అలాగే నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో 12 ఏళ్ల వైద్య సేవలు అందించారు. పాలకొండ ఏరియా ఆస్పత్రికి పదోన్నతిపై వెళ్లి 2009లో పదవీ విరమణ పొందారు. ఆయన మృతిపై నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లు సంతాపం తెలిపారు.

పరీక్ష కేంద్రం మార్చాలి


వర్సిటీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈనెల 13వ తేదీ నుంచి డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. అయితే ఈ పరీక్షలకు సంబంధించి ఆమదాలవలసలోని టీఎస్సార్ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు శ్రీకాకుళం పట్టణంలోని హెచ్‌పీఎస్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలను పరీక్ష కేంద్రంగా మంజూరు చేశారు. ఇదివరకు టీఎస్సార్ జూనియర్ కళాశాలే వారికి పరీక్ష కేంద్రంగా ఉండేది. ఈ కళాశాలలో చదువుతున్న హిరమండలం, బూర్జ, సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేటకు చెందిన 181 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉంది. అయితే వారందరికీ కనీసం ఆమదాలవలస, తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించకుండా, శ్రీకాకుళంలో కేటాయించడం వలన వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి బుధవారం చేరుకొని వీసీ కార్యాలయం ముందు నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది, అధ్యాపకులు వీసీని కలవాలని సూచన చేశారు. ఈ నేపథ్యంలో టీఎస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ మెట్ట చక్రధర్, అధ్యాపకులు వీసీ రజినీని కలిశారు. పరీక్ష కేంద్రం శ్రీకాకుళం పట్టణంలో ఉంటే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, పరీక్షకు సమయానికి హాజరు కాలేరని స్పష్టం చేశారు. దీంతో పరీక్ష కేంద్రం ఆమదాలవలసలో ఏర్పాటు చేయనున్నట్లు వీసీ హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.

రైతు ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: నందిగాం మండలం కొత్త అగ్రహారం గ్రామానికి చెందిన రామారావు అనే రైతు బుధవారం మద్యం మత్తులో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్పందించిన స్థానికులు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు.

పుస్తెలతాడు చోరీ

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో రెడ్డికవీధికి చెందిన అమర శ్రీలత ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి శ్రీలత మెడలోని బంగారు పుస్తెల తాడు చోరీ చేశాడు. ఈ మేరకు బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇద్దరిపై కేసు నమోదు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇద్దరు వ్యక్తులు అడ్డుకుని తమపై దాడి చేశారని సూర్యకాలనీకి చెందిన తల్లీకుమార్తెలు పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేశారు. రాజమండ్రి వెళ్లేందుకు ఆటో బుక్ చేసుకుని వెళ్తుండగా గత నెల 29న రాత్రి పది గంటలకు పూటుగా మద్యం తాగిన నూకరాజు, మణి అనే ఇద్దరు వ్యక్తులు ఆటోను అడ్డుకుని తమను చెయ్యి పట్టి లాగి దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఎల్‌బీలో 65 ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూలో ఏపీ లాసెట్ ప్రవేశాల ద్వారా 65 మంది విద్యార్థులు మూడేళ్ల న్యాయ విద్య (ఎల్ఎల్‌బీ)కు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. సెట్ కన్వీనర్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రంలోపు విద్యార్థులు చేరాల్సి ఉంటుంది.

గిట్టుబాటు ధర కల్పించాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన రైతుల జీవనాధారమైన జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు గొరకల బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిపాడులో శ్రీకాకుళ అమరుల స్థూపం వద్ద అమరవీరులకు బుధవారం నివాళులర్పించారు. ఈనెల 22న నిర్వహించనున్న శ్రీకాకుళ అమరవీరుల 46వ స్మారక సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీకాకుళ సాయుధం పోరాటంలో అమరులైన తామాడ గణపతి, డాక్టర్ చాగంటి భాస్కరరావు స్ఫూర్తితో ఉద్దాన రైతుల, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా జీడి పంటకు మద్దతు ధర, ఉద్దానంలో పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి పూనుకుందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు రాపాక మాధవరావు, పోతనపల్లి కుసుమ, సార జగన్, జె.అప్పయ్య, పోతనపల్లి మల్లేశ్వరరావు, కామేశ్వరరావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి హుద్‌హుద్ ఇళ్లు

- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ దువ్వాడ ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: సంతబొమ్మాళి మండలం ఉమిలాడ పంచాయతీలో పలువురు లబ్ధిదారులకు అందజేసిన హుద్‌హుద్ ఇళ్లను టీడీపీ కార్యకర్తలు అమ్ముకోవాలని ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు ప్రోత్సాహంతో కొంతమంది టీడీపీ కార్యకర్తలు అన్యాయంగా లబ్ధిదారుల పట్టాలను రద్దు చేశారని పేర్కొన్నారు. ఇటువంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మేరుగు అప్పారావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, పి.మీనకేతనరెడ్డి, చింతాడ చిన్నారావు, శ్రీరాములు, ఎస్.సుధాకర్ తదితరులు ఉన్నారు.

వీఓఏల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి


రణస్థలం ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఓఏలు

రణస్థలం: వెలుగు వీఓఏల మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేసి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వెలుగు వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. వీఓఏలపై రాజకీయ వేధింపులు ఆపాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ వెలుగు వివోఏ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం రణస్థలంలో వెలుగు ఏపీఎం మాధవిలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఓఏలకు గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని, 5జీ ఫోన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు కె.జయలక్ష్మి, బి.భారతి, డి.అసిరితల్లి, సునీత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

8న నరసన్నపేటకు బాలల హక్కుల కమిషన్

శ్రీకాకుళం అర్బన్: ఈనెల 8వ తేదీన జిల్లాలోని నరసన్నపేట మండలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పర్యటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రధాన కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళగిరి నుంచి గురువారం రాత్రి రోడ్డు మార్గాన బయల్దేరనున్న ఆయన శుక్రవారం ఉదయం నరసన్నపేటకు చేరుకోనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నరసన్నపేట ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో ఆర్టీసీ యాజమాన్యం నూతనంగా ఏర్పాటు చేసిన తల్లిపాలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. అలాగే 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిర్మూలనలో వివిధ శాఖల అధికారుల సమన్వయంపై జరగనున్న సమావేశంలో పాల్గొంటారు. అదేవిధంగా మధ్యాహ్నం 12.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణలో స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల పాత్రపై జరగనున్న సమావేశంలో పాల్గొంటారు. భోజన విరామానంతరం పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రోడ్డు మార్గాన తిరిగి మంగళగిరికి పయనం కానున్నారు.

హెచ్ఎం మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ఇచ్ఛాపురం రూరల్: ప్రస్తుత టెక్నాలజీ యుగంలో కూడా రెసిడెన్సియల్ శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడం ప్రభుత్వానికి సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా ఆగిరిపల్లిలో నిర్వహిస్తున్న లీడర్ షిప్ శిక్షణలో ప్రధానోపాధ్యాయులు తోట వెంకట రత్న కుమార్ మానసిక ఆందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆయన మరణానికి ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పని భారం, అనేక యాప్‌ల నిర్వహణ, రకరకాల పనులతో తీవ్ర ఒత్తిడికి ఒకవైపు గురౌతుంటే మరోవైపు స్కూల్ లీడర్ షిప్ ట్రైనింగ్, ఎఫ్ఎల్ఎన్ పేరుతో సుదూర ప్రాంతాల్లో, జిల్లా కేంద్రాల్లో వారం రోజుల పాటు ఇస్తున్న ఈ శిక్షణలను వాయిదా వేసి, తదుపరి శిక్షణా కేంద్రాల సంఖ్యను పెంచి నాన్ రెసిడెన్సియల్ విధానంలో నిర్వహించాలని కోరారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: పశ్చిమగోదావరిలో శిక్షణ పొందుతున్న ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటరత్న కుమార్ ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు బల్లెడ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెసిడెన్షియల్ విధానంలో కాకుండా నాన్ రెసిడెన్షియల్‌గా డివిజన్ కేంద్రాల్లో శిక్షణ ఇవ్వడం శ్రేయస్కరమన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న అన్ని విభాగాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బందిని గత ఆరు నెలలగా తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మజ్జి మదన్‌మోహన్, ఎస్వీ అనిల్‌కుమార్ ఆరోపించారు. ఆరిగిపల్లి (పశ్చిమగోదావరి జిల్లా) లో జరుగుతున్న లీడర్షిప్ ట్రైనింగ్‌లో హెచ్ఎం గుండెపోటుతో మరణించడం విచారకరమని ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రజలపై విద్యుత్ భారం మోపొద్దు

పలాస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల పాలనలోనే ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపైన భారాలు వేయడానికి సిద్ధపడటం దుర్మార్గమని న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు మండిపడ్డారు. పలాసలోని సూదికొండ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ట్రూ అప్ చార్జీల పేరిట వినియోగదారుల నుంచి రూ. 6072 కోట్లు అదనపు బిల్లులు వసూళ్లకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. నిత్యావసర సరుకులు, విద్యుత్ చార్జీలపై నియంత్రణ లేకపోవడంతో వాటి ధరలు నింగినంటుతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు చార్జీలను భారీగా పెంచారని మండిపడ్డారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు జుత్తు వీరాస్వామి, మామిడి భీమారావు పాల్గొన్నారు.